# నమస్తే తెలంగాణ

# ఖమ్మం

6 | ఖమ్మం, ఆదివారం 20 ఏప్రిల్ 2025 | KHAMMAM


## నేడు, రేపు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

ఖమ్మం, ఏప్రిల్ 19 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని జూబ్లీపురకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఎస్బీ ఐటీ విద్యాసంస్థల చైర్మన్ ఆర్జేసీ కృష్ణ గృహానికి వెళ్లి ఆయనను పరామర్శిస్తారు. 4.30 గంటలకు ఖమ్మంలోని గట్టు కరుణ కుమారుడి రిసెప్షన్‌కు హాజరవుతారు. సాయంత్రం 5.30 గంటలకు సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలం లింగాల గ్రామంలో దేవరపల్లి పట్టాభిరామ్ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. సోమవారం ఉదయం 7 గంటలకు భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. 9 గంటలకు భద్రాచలం హరిత హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారులు, కార్యకర్తలతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. 10 గంటలకు భద్రాచలం నుంచి పర్ణశాలకు బయలుదేరి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

ఖమ్మం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటున్న దృశ్యం

- వెనక్కి తీసుకోవాలని కోరుతున్న డీలర్లు
- స్థలం లేక ఇబ్బంది పడుతున్న వైనం
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు
- నిస్సహాయ స్థితిలో ఉన్నతాధికారులు

### ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాం..

జిల్లావ్యాప్తంగా మొత్తం 443 రేషన్ దుకాణాల్లో 1,050 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు నివేదికలు అందాయి. వాటిని వెనక్కి తీసుకోవడానికి ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యే అవకాశం ఉంది. డీలర్లు ఆందోళన చెందవద్దు.

**– రుక్మిణీదేవి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి, భద్రాద్రి కొత్తగూడెం**

రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం

# రేషన్‌షాపుల్లో మూలుగుతున్న.. దొడ్డు బియ్యం

అశ్వారావుపేట, ఏప్రిల్ 19 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. గత నెల మార్చిలో పంపిణీ చేయగా మిగిలిన బియ్యం దుకాణాల్లోనే ఉండిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్న విషయం విదితమే. అయితే అప్పటికే రేషన్ దుకాణాల్లో మిలిగిపోయిన బియ్యం మూలుగుతున్నాయి. దొడ్డు బియ్యం బస్తాలను నిల్వ చేసేందుకు స్థలం లేక డీలర్లు నానా అవస్థలు పడుతున్నారు. దొడ్డు బియ్యం వెనక్కి తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు సైతం నిస్సహాయ స్థితిలో మిన్నకుండిపోతున్నారు. అధికారులు రేషన్ దుకాణాల్లో కేవలం 1,050 మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం మాత్రమే ఉన్నట్లు చెబుతున్నప్పటికీ వాటి అంచనా సుమారు 1,500 నుంచి 2,000 మెట్రిక్ టన్నుల వరకు ఉండవచ్చవని డీలర్లు చెబుతున్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన కాంగ్రెస్ సర్కార్ అప్పటికే రేషన్ దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యం లెక్కపై సరైన నిర్ణయం తీసుకోలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా మార్చి నెల పంపిణీ తర్వాత మిగిలిన దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ దుకాణాల్లోనే పేరుకుపోయాయి. ఎక్కడి నుంచైనా బియ్యం తీసుకునే వెసులుబాటు లబ్ధిదారులకు ఉండడంతో డీలర్లు పోర్టబులిటీ కోటా కింద ఎక్కువ బియ్యాన్ని దిగుమతి చేసుకున్నారు. ఇప్పుడు అదే సమస్యగా మారింది. ఈ మిలిగిన దొడ్డు బియ్యం వెనక్కి ఎలా పంపాలో తెలియక, ఇరుకు గదుల్లో నిల్వ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన నాలుగు నెలలుగా బియ్యం పంపిణీ ఆలస్యం కావడంతో డీలర్లు మార్చిలో ఎక్కువ మొత్తంలో బియ్యం నిల్వ చేసుకున్నారు. ఈ దశలో సన్నబియ్యం రావడంతో దొడ్డు బియ్యం పంపిణీ మార్చి నెలతోనే నిలిచిపోయింది. ఫలితంగా రేషన్ దుకాణాల్లోనే దొడ్డు బియ్యం నిల్వ ఉండి బూజుపడుతున్నాయి. బస్తాలను నిల్వ చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దొడ్డు బియ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డీలర్లు కోరుతున్నప్పటికీ పౌర సరఫరాల శాఖాధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని చెబుతున్నారు.

### ప్రతి నెలా 5,479 టన్నుల బియ్యం పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా ప్రతి నెలా పౌర సరఫరాల శాఖ లబ్ధిదారులకు 5,479 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నది. జిల్లాలో మొత్తం 443 రేషన్ దుకాణాలున్నాయి. వీటి పరిధిలో 2,93,754 రేషన్‌కార్డులు ఉన్నాయి. అందులో అంత్యోదయ కార్డులు 21,145, అన్న పూర్ణ కార్డులు 3, ఫుడ్ సెక్యూరిటీ కార్డులు 2,72,606 కార్డులు ఉన్నాయి. గత నెలలో 75 శాతం మాత్రమే బియ్యం పంపిణీ జరిగినట్లు సమాచారం. ఈ లెక్కన సుమారు 1,500-2,000 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం రేషన్ దుకాణాల్లోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. వీటిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో రేషన్ డీలర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

# ‘సవరణ’ కాదు.. అధికారుల పనితీరు మారాలి

- తిరుమలాయపాలెంలో భూ భారతి అవగాహన సదస్సులో రైతుల ఆవేదన
- చట్టంలోని అవకాశాల ద్వారా సమస్యల పరిష్కారం : ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

తిరుమలాయపాలెం సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 19 : భూ చట్టాల్లో మార్పు తేవడం కాదు.. రెవెన్యూ అధికారుల పనితీరులో మార్పు రావాలి.. అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు రైతులు జిల్లా ఉన్నతాధికారుల ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో భూ భారతి చట్టంపై శనివారం జరిగిన అవగాహన సదస్సుకు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ హాజరయ్యారు. తొలుత ఆర్డీవో నర్సింహారావు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. రైతులు తమ సలహాలు సూచనలు తెలపాలని ఇన్‌చార్జి కలెక్టర్ కోరారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌డీ జియావుద్దీన్ మాట్లాడుతూ సదస్సుల వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, ముందు రెవెన్యూ అధికారుల పనితీరులో మార్పు తేవాలని సూచించారు. అధికారుల తీరుతో మండలంలో భూ పరిపాలన అస్తవ్యస్తంగా మరిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాతర్లపాడు, సుబ్లేడు, తెట్టల పాడు తదితర గ్రామాల్లో 500 ఎకరాల దేవాదాయ భూములకు సంబంధించి రికార్డులు మారిపోయి అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నట్లు ఆరోపించారు. 146 చెరువులు, కుంటల శిఖం భూములు, 51 ఎకరాల భూదాన్ భూములు, 9 ఎకరాల వక్ఫ్ భూములు కబ్జా జరిగినట్లు తెలిపారు 1,253 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు పేర్కొన్నారు. మహ్మదాపురం సమీపంలోని 189 సర్వే నెంబర్‌లోని అసైన్డ్ భూమిలో పెద్ద పెద్ద భవనాలు నిర్మించినట్లు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ మంత్రి పొంగులేటి అనుచరుడే తిరుమలాయపాలెంలో 256 సర్వే నెంబర్‌లో అతి ఖరీదైన భూమిని కబ్జా చేసి పట్టా పొందినట్లు ఆరోపించారు. మేడిదపల్లికి చెందిన రావుల నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమి 45 ఎకరాలను మంత్రి పొంగులేటి అనుచరులు అనుభవిస్తున్నట్లు ఆరోపించారు.

రెవెన్యూ అధికారుల పనితీరుపై తన ఆవేదన వెలిబుచ్చుతున్న జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు జియావుద్దీన్

### లోపాలను సరిచేయడానికే.. : ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

లోపాలను సరిచేయడానికి ప్రభుత్వాలు కొత్త భూ చట్టాలు తెచ్చాయని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ తెలిపారు. సదస్సులో పలువురు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పారు. భూ భారతి చట్టం 70 ఏళ్లుగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని వివరించారు. ప్రజలు వెలిబుచ్చిన సమస్యలను ఈ చట్టంలో ఉన్న అవకాశాల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ రామసహాయం నరేందర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ సుధీర్, ప్రత్యేకాధికారి రమేశ్, ఎంపీడీవో షేక్ శిలార్ సాహెబ్, ఏడీఏ సరిత, ఏవో సీతారామిరెడ్డి, ఎస్ఐ జగదీశ్, డీటీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# 463 కేజీల గంజాయి పట్టివేత

- ఐదుగురిపై కేసు, 216 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ కరుణాకర్

పట్టుబడిన లారీతో పోలీస్ అధికారులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 19 : గంజాయిని తరలిస్తున్న లారీని పట్టుకొని ముగ్గురు నిందితులతోపాటు ఒప్పందం కుదిర్చిన వ్యక్తి, వ్యాపారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ కరుణాకర్ శనివారం వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం అగర్ మాల్వా ప్రాంతానికి చెందిన ఠాకూర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం నుంచి గంజాయి రవాణా చేస్తే రూ.5 లక్షలు ఇస్తానని ముఖేశ్ సూర్యవంశీ అలియాస్ ముఖేష్, తన స్నేహితుడు రాజేశ్ గుర్జార్ అలియాస్ రాజు ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి సహకరించినందుకు మరో వ్యక్తి సాలగ్రామ్‌కు ఖర్చులు పోను రూ.50 వేలు ఇచ్చి.. మిగతా రూ.4 లక్షల్లో రూ.2 లక్షలు రాజేశ్‌కు, మరో రూ.1.50 లక్షలు ముఖేష్ తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం విజయనగరం వెళ్లి అక్కడ ఒడిశాకు చెందిన సోమనాథ్ నుంచి రూ.2,31,87,000 విలువ గల 463.740 కేజీల గంజాయిని 216 ప్యాకెట్లుగా చేసి లారీలో లోడ్ చేసుకుని అశ్వారావుపేట మీదుగా బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీ ఎదురుగా ఎస్సై యయాతి రాజు సిబ్బందితో నిఘా పెట్టారు. ఈ క్రమంలో లారీని ఆపి తనిఖీ చేయగా.. 216 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. పట్టుబడిన గంజాయి ప్యాకెట్లతోపాటు వారి నుంచి 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని లారీని సీజ్ చేశారు. గంజాయి తరలిస్తున్న ముఖేష్, రాజేశ్ గుర్జార్, సాలగ్రామ్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ తర్వాత నిందితులు నేరం అంగీకరించడంతో పట్టుబడిన ముగ్గురు నిందితులతోపాటు గంజాయి ఒప్పందం చేసుకున్న ఠాకూర్, గంజాయి వ్యాపారి సోమనాథ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. సమావేశంలో అశ్వారావుపేట, దమ్మపేట ఎస్సైలు రాజు, సాయి కిశోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాపార విస్తరణలో సింగరేణి సక్సెస్

- నైనీ బొగ్గు బ్లాక్ సాధన వెనుక అందరి సహకారం
- సింగరేణి సీఎండీ బలరాం

మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 19 : వ్యాపార విస్తరణలో సింగరేణి సంస్థ తొలి అడుగులోనే రాష్ట్రంలోని నైనీ బొగ్గు గనిని విజయవంతంగా ప్రారంభించిందని, ఇదే స్ఫూర్తితో మరిన్ని గనులు, ఇతర ఖనిజ ఉత్పత్తులను చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. నైనీ బొగ్గు గని ప్రారంభంతో సింగరేణి సంస్థ ఇక ఎక్కడైనా విస్తరించగలదన్న భరోసా అందరికీ కలిగిందన్నారు. నైనీ బొగ్గు బ్లాక్‌ను ప్రారంభించిన సందర్భంగా శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు సీఎండీ బలరాంకు అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ నైనీ బొగ్గు బ్లాక్ సాధన వెనుక సీఎం, డిప్యూటీ సీఎం ప్రత్యేక చొరవతోపాటు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి, ఒడిశా సీఎం, స్థానిక ఎమ్మెల్యే, వివిధ శాఖల అధికారుల సహకారం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో సమస్వయ బాధ్యతను స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం నుంచి సంస్థ డైరెక్టర్ సత్యనారాయణరావు, ఎల్వీ సూర్యనారాయణరావు, వెంకటేశ్వర్లు, జీఎంలు మనోహర్, కార్పొరేట్ విభాగాల అధిపతులు, జీఎంలు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు**

మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు

ఖమ్మం, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం నగరంలోని అమరవీరుల స్థూపం వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, రూ.25 వేల పెన్షన్, ఇల్లు కట్టుకోవడానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం సికింద్రాబాద్‌లో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులు రవి చంద్ర హాన్, పెళ్ళూరి విజయ్ కుమార్, వర లక్ష్మి, ఉమా, అనంతలక్ష్మి, స్వరూప, ధన లక్ష్మి, జయ, పద్మ, మేరీ పాల్గొన్నారు.

# రేషన్‌డీలర్లు నష్టపోవద్దు

**అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

రఘునాథపాలెం, ఏప్రిల్ 19 : సన్న బియ్యం పంపిణీలో రేషన్‌డీలర్లు నష్టపోకుండా ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద తూకం సరిగా వేసి అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లై అధికారులు, గోదాముల ఇన్‌చార్జ్‌లు, స్టేజ్-1,2 కాంట్రాక్టర్లు, రేషన్‌డీలర్స్ అసోసియేషన్ నేతలు, హమాలీ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. తరుగు రావడానికి కారణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లకు వచ్చే లారీలను ముందుగా తప్పక కాటా వేయించాలన్నారు. తక్కువ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వెనక్కి పంపాలని ఆదేశించారు. సన్నబియ్యం కచ్చితంగా తూకం వేసి రేషన్‌డీలర్లకు అందించాలన్నారు. డీఎం శ్రీలత, డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న, ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియా, దొండా దుర్గయ్య, అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో పలు ఆసుపత్రుల మూసివేత

డాక్టర్ కళావతీబాయి

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 19 : చికిత్సలు లేకుండానే నకిలీ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ నిధులు కాజేసిన వ్యవహారంలో జిల్లాలో 10 ఆసుపత్రులను మూసివేసినట్లు ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి కళావతీబాయి శనివారం తెలిపారు. ఆరోపణల మేరకు విజిలెన్స్, వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అధికారుల బృందం ఆసుపత్రుల్లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మంలోని శ్రీవినాయక హాస్పిటల్, శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, న్యూ అమృత హాస్పిటల్, మేఘ, డాక్టర్ జేఆర్ప్రసాద్, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్లకు మూసివేత ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.